www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 74 | సోమవారం | 26 ఆగస్టు 2024



# యువత రాజకీయాల్లోకి రావాలి

## అప్పుడే ప్రజాస్వామ్యానికి మరింత బలం.. మన్కీ బాత్ లో ప్రధాన మంత్రి మోదీ

**యువత రాజకీయాల్లోకి వస్తేనే ప్రజాస్వామ్యానికి బలం అని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశ పునాదులను పటిష్ఠం చేసే ఎన్నో విషయాలు 21వ శతా బ్దం లో జరుగుతున్నాయని తెలి పారు. 113వ 'మన్ కీ బాత్' ఎపి సోడ్ లో ఆయన మాట్లాడుతూ రాజకీయ నేపథ్యం లేకపోయినా అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు.**



ఢిల్లీ: దేశం కోసం వారు తమని తాము పూర్తిగా అంకితం చేసుకు న్నారన్నారు. నేడు వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి మనం మ- రోసారి అదే స్ఫూర్తిని పునరుజ్జీ వింపజేయా ల్సిన అవసరం ఉంద న్నారు. పెద్ద సంఖ్యలో యువత రాజకీయాల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారికి సరైన అవ కాశం, మార్గదర్శక త్వం కావాల్సి ఉంద న్నారు. కుటుంబ రాజకీ యా లు నూతన ప్రతిభను అణచివేస్తా యని పేర్కొన్నారు. అంతరిక్ష రంగం లో భారత్ దూసుకెళ్తొందని గుర్తు చేశారు. చంద్రయాన్ విజయానికి గుర్తుగా స్పేస్ డే నిర్వహించుకు న్నట్లు తెలిపారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా'

మిగతా 2 లో

# కబ్జాల నుంచి చెరువులకు విముక్తే లక్ష్యం

## ఆక్రమణల కూల్చివేతలు.. భగవద్గీత స్ఫూర్తితోనే..

- తాగునీటి జలాశయాల్లోకి వాటి మురుగుకాల్వలు
- అలా వదిలేస్తే ముఖ్యమంత్రిగా విఫలమైనట్లే కదా!
- హైదరాబాద్‌ను విపత్తుల నుంచి కాపాడేందుకే..
- ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే వ్యక్తులైనా వదలం
- కక్షసాధింపుల్లేవు.. రాజకీయాలకు సంబంధం లేదు
- ధర్మయుద్ధంలో ప్రజలు అండగా నిలవాలి: సీఎం
- హరేకృష్ణ టవర్స్ అనంత శేష స్థాపనలో రేవంత్







హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ : నగరంలోని అక్రమ కట్టడాల కూల్చివేతకు స్ఫూర్తి 'భగవద్గీత' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ధర్మాన్ని రక్షించేందుకు 'గీత'లో శ్రీకృష్ణుడు బోధించిన యుద్ధనీతి స్ఫూర్తితోనే ప్రజల జీవన విధానంలో, సంస్కృతిలో భాగమైన చెరువులను సంరక్షించే మహాయజ్ఞానికి తమ ప్రభుత్వం నాంది పలికిందన్నారు. "ప్రజా ప్రతినిధులు విధి నిర్వహణలో భాగంగా తెలియకుండా కొన్ని తప్పులు

మిగతా 2 లో



సామాన్యుల జోలికొస్తే

## ఊరుకోం..

పెద్దల అక్రమ కట్టడాలను కూల్చివేస్తే ఓకే

పేదల ఇళ్లను పడగొడితే చూస్తూ కూర్చోం

సమస్యలపై పక్కదారికే హైడ్రా: ఈటల

.. వివరాలు 2లో



## పాత పద్ధతులు, పైరవీలు మర్చిపోండి..

ప్రభుత్వ లక్ష్యాల కోసం పని చేయండి

తప్పు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం

సబ్‌రిజిస్ట్రార్లతో ఇష్టాగోష్ఠిలో పొంగులేటి

.. వివరాలు 2లో



# రేవంత్ సర్కార్

## మా ఎమ్మెల్యేలను వేధిస్తోంది

- కాంగ్రెస్ కండువా కప్పుకోకుంటే కేసులా?
- హైడ్రాతో రాజకీయం: హరీశ్
- నా మెడికల్ కాలేజీని కూల్చేందుకు కుట్ర: పల్లా

**"కాంగ్రెస్ కండువా కప్పుకోండి.. కాదు.. లేదంటే.. మీపై అక్రమ కేసులు పెడతాం.. మీ ఆస్తులు కూల్చేస్తాం.. మిమ్మల్ని టార్గెట్ చేస్తాం" అంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వేధిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేలా కాంగ్రెస్ సర్కారు రాజకీయాలు చేస్తోందని, రాజకీయంగా ఎదుర్కొనలేకనే వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.**

హైదరాబాద్, ప్రజానావ : మొన్న పటాన్‌చెరు ఎమ్మెల్యేపై అక్రమ మైనింగ్ కేసు పెట్టి.. రూ.300 కోట్ల జరిమానా వేసి ఇబ్బందులకు గురిచేసి.. కాంగ్రెస్ కండువా కప్పారని, ఆ వెంటనే మైనింగ్ కేసు అటకెక్కించారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని

మిగతా 2 లో

# రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం

## మరో ఐదు రోజులు భారీ వర్షాలు



హైదరాబాద్, ప్రజానావ : అల్పపీడనం ప్రభావంతో రానున్న దురోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో అకడకడ భారీ వర్షాలు కురిసే

మిగతా 2 లో



# భక్తజనసంద్రం యాదగిరిక్షేత్రం

## స్వామివారి నిత్య ఆదాయం రూ.48,47,250

యాదగిరిగుట్ట, ప్రజానావ : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్శనార్థం ఆదివారం వచ్చిన భక్తులతో యాదగిరికొండ భక్తజన సంద్రమైంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. సుమారు 26వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా కన్పించాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద భక్తుల రద్దీ కొనసాగింది.

# యువత రాజకీయాల్లోకి రావాలి





**మొదటి పేజీ తరువాయి**

ఉద్యమంలా సాగిం ది. తన పిలుపు మేరకు దాదాపు 5 కోట్లకు పైగా మంది జాతీయ జెండా తో ఫొటోలు దిగి వెబ్సై ట్లో అప్లోడ్ చేసినట్లు వెల్లడించారు.

మూడు కోట్ల మంది లఖ్‌పతి దీదీలు లక్ష్యం

ం దేశంలో మహిళలపై నేరాలను సహించబోము

ంమహారాష్ట్ర లఖ్‌పతి దీదీ కార్య క్రమంలో ప్రధాని మోదీ

ప్రజా దీవెన, జలగావ్: మహిళలపై పెరుగుతున్న నేరాలపై ప్రధాన మం త్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశా రు. మహిళల పై నేరాలకు పాల్పడే వారి పట్ల కఠి నంగా వ్యవహరిస్తామని, ఎట్టి పరిస్థి తిల్లోనూ వారిని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. మహారాష్ట్రలోని జలగావ్‌లో ఆదివారంనాడు జరిగి న 'లఖ్‌పతి దీదీ' కార్యక్ర మంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మహిళ లపై నేరాలకు పాల్పడే వారిని శిక్షిం చేందుకు కఠిన చట్టాలను రూపొం దిస్తున్నమని చెప్పారు. దేశంలో గత రెండు వారాల్లో మహిళలపై అకృత్యాల ఘటనలు చోటుచేసుకు న్న నేపథ్యంలో ప్రధానమంత్రి ప్రకట న ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల కోల్‌కతాలో వైద్య విద్యార్థి నిపై అత్యాచారం, హత్య దేశవ్యా ప్తంగా సంచలనం సృష్టించగా, ఆ వెంటనే బద్లాపూర్ పాఠశాలలో లైంగిక వేధింపుల ఘటన అందర్నీ ఉలిక్కిపడేలా చేసింది. కాగా, 'లఖ్ పతి దీదీస్' కార్యక్రమంలో ఏటా లక్ష రూపాయలు ఆదాయం పొందుతు న్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళలతో మోదీ ముఖాముఖీ సంభాషించ డంతో పాటు, 11 మందిని సన్మా నించారు. రూ.5000 కోట్ల బ్యాంకు రుణాలను సైతం ఈ సందర్భంగా ఆయన పంపిణీ చేశారు. ఇందువల్ల 25.8 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు లబ్ది పొందుతారు. మూ డు కోట్ల మందిని లఖ్‌పతి దీదీలు గా చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# కన్న కొడుకులే కాలయములు

నిడమనూరు/గండీడ్, ప్రజానావ : కన్న కొడుకులే వాళ్ల పాలిట కాలయములయ్యారు. తాగిన మైకంలో కసాయిల్లాగా మారారు. ఒకడు తల్లి గొంతు కోసి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఆ తరువాత అదే కత్తితో తనూ గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరొకడు డబ్బు ఇవ్వలేదన్న కోపంతో ఇనుపరాడ్డుతో తన తల్లి తలపై మోది, గొంతుకోసి చంపేశాడు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రం, మహబూబ్‌నగర్ జిల్లా గండీడు మండల పరిధిలోని సల్కర్‌పేట్ గ్రామంలో ఈ రెండు ఘటనలు జరిగాయి.

నిడమనూరు మండల కేంద్రానికి చెందిన రావిరాల వీరయ్య, సాయమ్మ(65) దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉ న్నారు. గ్రామంలో ఆ వృద్ధ దంపతులు పాలు విక్రయించి జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ మిర్యాలగూడలో టైలరింగ్ వృత్తి చేసుకుంటున్నాడు. చిన్న కుమారుడు శివకుమార్(36) కారు డ్రైవరుగా పనిచేస్తూ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. శివకుమార్‌కు తన మేనకోడలితో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఓ కుమార్తె పుట్టి చనిపోయింది.

భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతో పెద్దమనుషుల సమక్షంలో రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. కోర్టులో కూడా విడాకుల కేసు నడుస్తోంది. ఈ క్రమంలో శివ మద్యానికి బానిసయ్యాడు. మ-రోవైపు, అతడు విడాకులిచ్చిన మహిళకు శనివారం వేరే వ్యక్తితో వివాహం జరిగింది. ఆ పెళ్లికి శివకుమార్ తండ్రి, సోదరుడు వెళ్లారు. దీన్ని శివకుమార్ జీర్ణించుకోలేకపోయాడు. శనివారం రాత్రి బాగా మద్యం తాగి.. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వెళ్లాడు. నిద్రపోతున్న తల్లితో గొడవ పడి కత్తితో కిరాతకంగా గొంతుకోశాడు. రక్తపు మడుగులో విలవిలలాడుతూ ఆ వృద్ధురాలు అక్కడికక్కడే చనిపోయింది. తల్లిని చంపిన భయంతో అటూ ఇటూ పరుగులు పెడుతూ తాను కూడా అదే కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# కబ్జాల నుంచి చెరువులకు విముక్తే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

చేస్తుంటారు. వాటిని సవరించుకోడానికి తెలిసి కొన్ని మంచిపనులు కూడా చేయాలన్నది నా ప్రగాఢ విశ్వాసం. ఆ క్రమంలోనే చెరువులను కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేయాలన్న ఏకైక లక్ష్యంతో.. మా మీద ఎంత ఒత్తిడి వచ్చినా, ఎవరినీ వదలకుండా ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఆదివారం హరేకృష్ణ భక్తి ఉ ద్యమం ఆధ్వర్యంలో కోకాపేటలో చేపట్టిన హరేకృష్ణ హెరిటేజ్ టవర్స్ నిర్మాణ ప్రక్రియలోని అనంత శేష స్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు విద్యార్థులు వేద మంత్రోచ్ఛారణలతో ఘనస్వాగతం పలికారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమి పూజలో పాల్గొన్న అనంతరం సీఎం కీలకోపన్యాసం చే శారు. "హైదరాబాద్‌ను వరదల నుంచి సంరక్షించడం కోసం ఆనాడు నిజాం ప్రభుత్వం.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి నిపుణుల సూచనలతో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను నిర్మించింది.



మొన్నటికి మొన్న కృష్ణా, గోదావరి ఎండిపోయి, వేసవిలో తాగునీటి సమస్య వస్తే.. ఈ జలాశయాలే నగరవాసుల దాహార్తిని తీర్చాయి. అలాంటిది కొంతమంది శ్రీమంతులు, గొప్పవ్యక్తులుగా పేరుపొందిన వారు చెరువుల్లో ఫాంహౌసలు నిర్మించుకొని, వాటి నుంచి పారే మురుగు కాల్వలను నగరానికి తాగునీరు సరఫరా చేసే జంట జలాశయాల్లో కలిపారు. సామాన్యుల తాగునీటి చెరువుల్లో మురుగు నీరు కలపడాన్ని చూస్తూ ఊరుకొంటే, అక్రమ నిర్మాణాలను అలానే వదిలేస్తే ఇక నేను ప్రజాప్రతినిధిగా విఫలమైనట్టా? కాదా?" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే తనపై ఎంత ఒత్తిడి వచ్చినా, మిత్రులకు ఫాంహౌసలున్నా.. ఏవీ వదలకుండా హైడ్రా సంస్థను ఏర్పాటు చేశామని, చెరువుల్లో ఉన్న అక్రమ కట్టడాలను కూలగొడుతున్నామని ఆయన వివరించారు.

**కక్ష సాధింపులకు తావు లేదు..**

చెరువులను ఆక్రమించిన వారిలో కొందరు ప్రభుత్వాన్ని, సమాజాన్ని అత్యంత ప్రభావితం చేయగలిగిన స్థానాల్లో ఉన్నారని సీఎం రేవంత్ తెలిపారు. మరికొందరు ప్రత్యక్షంగా ప్రభుత్వంలో భాగస్వాములుగానూ ఉండవచ్చునని, అయినా.. వాటన్నింటినీ పట్టించుకోదలచుకోలేదన్నారు. ఇది రాజకీయాలకు సంబంధం లేనిదని, కొందరు రాజకీయ నాయకులను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన కార్యక్రమం కాదని స్పష్టం చేశా రు. ఇందులో ఎలాంటి కక్ష సాధింపులకు తావు లేదని పేర్కొన్నారు. "ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తే అది మన మీద కక్ష కడుతుంది.

ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో చెన్నై, ఉత్తరాఖండ్, కేరళలోని వయనాడ్ ఉదంతాలను చూశాం. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అయినా హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. అందుకే నగరంలోని చెరువులను కాపాడే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంది. ఎవరేమి అనుకున్నా, మా మీద ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా.. వాటన్నింటినీ పక్కనబెట్టి మరీ చెరువులను ఆక్రమించుకున్న వాళ్ల భరతం పడతాం. మా ప్రభుత్వం తలపెట్టిన ఈ ధర్మ యుద్ధానికి ప్రజలంతా అండగా నిలవాలి, సహకరించాలి" అని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

**మధ్యాహ్న భోజనానికి హరేకృష్ణ సహకారం..**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు హరేకృష్ణ సంస్థ సహాయం కోరినట్లు సీఎం రేవంత్ తెలిపారు. దీంతోపాటు నగరంలోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్, నిలోఫర్, క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు నాణ్యమైన భోజనం అందించేందుకు అక్షయపాత్ర సహకారం అవసరమని అన్నారు. భోజన కేంద్రాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. హరేకృష్ణ సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమానికీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హరేకృష్ణ హెరిటేజ్ టవర్స్ నిర్మాణంతో నగరం ఆధ్యాత్మిక ధామానికి నెలవుగా మారుతుందన్నారు. చెరువుల పరిరక్షణకు సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదన్నారు. హైడ్రా పనితీరును కొనియాడారు. కాగా, ప్రజలను చైతన్యమార్గంలో నడిపించడమే ఈ మహా నిర్మాణం ముఖ్య ఉద్దేశమని అక్షయపాత్ర వ్యవస్థాపకుడు మధుపండిట్ దాస తెలిపారు. శ్రీరామ, వెంకటేశ్వర, కృష్ణబలరామ అవతార తదితర దేవాలయాల సమూహంతోపాటు అత్యాధునిక వసతులతో కూడిన సభా మందిరాలు, ధ్యాన కేంద్రాలను హెరిటేజ్ టవర్స్‌లో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం లో హరేకృష్ణ ఉద్యమం తెలుగు రాష్ట్రాల బాధ్యుడు సత్యగౌరస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా మందిర నిర్మాణానికి వాతం మహేశ్, ప్రదీప్ అగర్వాల్ రూ.7.5 కోట్ల చెక్కును సీఎం రేవంత్ చేతులమీదుగా నిర్వాహకులకు అందించారు.

# రేవంత్ సర్కార్ మా ఎమ్మెల్యేలను వేధిస్తోంది

**మొదటి పేజీ తరువాయి**

మండిపడ్డారు. ఇప్పటివరకు ఆరు కేసులు పెట్టారని, పల్లాతోపాటు ఆయన భార్య, పిల్లలపైనా కేసులు పెట్టారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లక్ష్యంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో రాజకీయ కుట్ర చేస్తోందని ఆరోపించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాలేజీలు ప్రభుత్వ భూమిలో ఉంటే బయటపెట్టాలని, 24గంటల్లో ఆయనే వాటిని తొలిగిస్తారని చెప్పారు. రాజకీయ కక్షలను విద్యాసంస్థలు, ఆస్పత్రులపై రుద్దడం తగదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తనపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తోందని, 9 నెలలుగా తనపై వేధింపులు మొదలయ్యాయని ఆరోపించారు. తాను 25 ఏళ్ల క్రితమే విద్యాసంస్థలు ప్రారంభించానని, అక్రమ నిర్మాణాలంటూ తన మెడికల్ కాలేజీని కూల్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన భూమిలో మాత్రమే నిర్మాణాలు చేపట్టామని, కబ్జా చేశానని నిరూపిస్తే వాటిని కూల్చడానికి కూడా సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే వేధింపులు భరించలేక గొంతుకోసుకొని ఆత్మహత్యా యత్నం చేసి యశోద ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న నస్పూర్ మునిసిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. అదే ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణరెడ్డినీ ఆయన పరామర్శించారు.

# సామాన్యుల జోలికొస్తే ఊరుకోం..

హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ : చెరువు, బఫర్ జోన్‌లలో నిర్మించిన పెద్దల అక్రమ నిర్మాణాలను హైడ్రాతో కూల్చివేయించడం సంతోషమే కానీ.. అదే ముసుగులో సామాన్యుల నిర్మాణాలను పడగొడతామంటే ఊరుకోబోమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని సాహెబ్‌నగర్, సరూర్‌నగర్ చెరువు, ఫాక్స్‌సాగర్ చుట్టూ ఇళ్లు కట్టుకున్నవారు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజలను ఆందోళనకు గురిచేయడం తగునా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సమస్యల నుంచి పక్కదారి పట్టించేందుకే హైడ్రాను ముందుకుతెచ్చారని ఆరోపించారు. ప్రజలు దీనంతటినీ గమనిస్తున్నారని అన్నారు.

ఆదివారం మల్కాజిగిరిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ కూడా అధికారంలోకి వచ్చిన కొత్తలో అయ్యప్ప సొసైటీలో భవనాలను కూల్చే ప్రయత్నం చేసి తోక ముడిచారని, తర్వాత ఏం జరిగిందో చూశామని అన్నారు. బతుకమ్మ కుంటను పూడ్చింది ప్రభుత్వం కాదా? దమ్ముంటే ప్రభుత్వమే పూడ్చిన చెరువుల మీద చర్యలు తీసుకోవాలని ఈటల సవాల్ విసిరారు. అసలు ఇలాంటి చెరువులు ఎన్ని ఉన్నాయో లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. వాటిని తిరిగి చెరువులు గా మారుస్తారా? లేదా? అని ప్రశ్నించారు.

ఉమ్మడి ఏపీలో 40 ఏళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉందని.. చెరువుల్లో నిర్మాణాలకు అనుమతులిచ్చింది కూడా ఆ పార్టీ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు. రక్త సంబం ధం కన్నా పార్టీతో ఉన్న సంబంధమే తనకు ఎక్కువ అని ఈటల స్పష్టం చేశారు. మీరు పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఎల్లప్పుడూ వెంటే ఉంటానన్నారు. పార్టీ పని తప్ప తనకు ఇతర పనులు లేవని ఆయన స్పష్టం చేశారు.

# పాత పద్ధతులు, పైరవీలు మర్చిపోండి..



ఖైరతాబాద్, ప్రజానావ : ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పైరవీలు, పాత పద్ధతులన్నీ మర్చిపోయి, ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయకపోతే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని చెప్పారు. విధి నిర్వహణలో ఇసుమంతైనా అవినీతి కనిపించవద్దని వ్యాఖ్యానించారు. ఆదివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు.

"వాళ్లతో, వీళ్లతో చెప్పిస్తూ పైరవీలు చేస్తే ఊరుకునేది లేదు. మీ ఆరోగ్య సమస్యలు, ఇతరత్రా ఇబ్బందులేమైనా ఉంటే తప్పకుండా మానవతా దృక్కోణంలో పరిశీలిస్తాం" అని మాట ఇచ్చారు. అందరూ కష్టపడి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. "భూముల మార్కెట్ ధరలను ప్రాంతాలను బట్టి శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ధారించండి" అని మంత్రి సూచించారు. ఇందుకు సంబంధించి మహారాష్ట్ర, కర్నాటకలో మెరుగైన పద్ధతులు అనుసరిస్తున్నారని, రెండు బృందాలు వెళ్లి పరిశీలించి రావాలని సూచించారు. భూముల మార్కెట్ ధరలను నిర్ధారించిన తర్వాత దశలో మరో ఏజెన్సీతో వాటిని సరిపోల్చుకుంటామని తెలిపారు.

**రెండేళ్లలో అన్ని రిజిస్ట్రేషన్ ఆఫీసులు ప్రభుత్వ భవనాల్లోనే**

రెవెన్యూ కార్యాలయాల అద్దె, విద్యుత్ ఛార్జీలు, అద్దె వాహనాల ఛార్జీలకు అవసరమైన బడ్జెట్‌ను త్వరలోనే క్లియర్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖకు శాశ్వత ప్రభుత్వ భవనాలు అవసరమని, రెండేళ్లలో అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లో పని చేసేలా చూస్తామని చెప్పారు. శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ పనితీరు గురించి మంత్రికి వివరించారు. 2014లో రూ.2,746 కోట్లుగా ఉ న్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గతేడాది రూ.14,588 కోట్లకు చేరుకుందని తెలిపారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వార్షిక నివేదికను మంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. సమావేశంలో అదనపు ఐజీలు, డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్‌లు, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం

**మొదటి పేజీ తరువాయి**

అవకాశం ఉందని చెప్పింది.

సోమవారం నుంచి మంగళవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల జిల్లాల్లో అకడకడ వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అకడకడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నట్టు తెలిపింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో 7.2సెం.మీ వర్షపాతం నమోదైంది.



# చెరువుల ఆక్రమణలను వదిలేది లేదు

- తెలంగాణ వ్యాప్తంగా గుర్తించి చర్యలు
- ఆధారాలతో ఎవ్వరైనా ఫిర్యాదు చేయొచ్చు
- హైడ్రా చర్యలను సమర్థించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ప్రజానావ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హైడ్రా చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా.. ముందు రాజధాని నగరంలో, తరువాత అన్ని జిల్లాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయో వివరాలు సేకరించి వాటిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. భౌగోళిక పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం నుండి వాతావరణాన్ని పరిరక్షించుకోవడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి గతంలో ఉన్న చెరువులకు ప్రభుత్వ లెక్కలకు రికార్డులకు అనుగుణంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పరిరక్షించుకోవాలని స్వచ్ఛంద సంస్థలకు, గతంలో ఇక్కడ చెరువు ఉండే అని తెలిసిన వారు స్థానికులు ఎవరైనా పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే పని.. చెరువుల పరిరక్షణ స్థానికులదేనని అన్నారు. ప్రభుత్వానికి ఎవరి మీద రాజకీయ కక్ష సాధింపు లేదని తేల్చి చెప్పారు. హైడ్రాకు ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది.. ప్రభుత్వం చేస్తున్న పనిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగింది అంటే న్యాయ స్థానాలు ఉన్నాయని అన్నారు. చెరువుల పరిరక్షకులు అందరూ ఎక్కడెక్కడ అక్రమణకు గురయ్యాయో వాటి ఆధారాలు సంబంధిత అధికారులకు ఇవ్వాలన సూచించారు. 33 జిల్లాల్లో ఎక్కడైనా గ్రామాలు, మండలాలు, పట్టణాలు, మున్సిపాలిటీ చెరువులు ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాల్లో మీకు ఉన్న అవగాహన, ఆలోచనను ప్రభుత్వం దృష్టికి తీసుకురండని పిలుపునిచ్చారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

**బిఆర్ఎస్ విమర్శలపై మండిపడ్డ కోదండరెడ్డి**
**రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలు కూల్చేయాలన్న నేతలు**

**హైదరాబాద్, ప్రజానావ :** హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. తెలంగాణ సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, నాలాలు రక్షిస్తోందని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడు తూ... దూరదృష్టితో హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. ప్రొటెక్షన్ ఆఫ్ లేక్స్ కమిటీ కూడా గతంలో వేసిందే అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజన కాకముంటే కాంగ్రెస్ సర్కార్ 2030 వరకు హెచ్ఎండీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందించిందన్నారు. తాగునీటి అవసరాల కోసం కూడా మాస్టర్ ప్లాన్‌లో లేక్స్ ప్రొటెక్షన్ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అక్రమ నిర్మాణాలకుమద్దతు చేసిందని ఆరోపించారు. హైడ్రా ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌పై ఎంఐఎం, బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు పూర్తిగా మద్దతు ఇస్తున్నారన్నారు. ప్రజలు కూడా ర్యాలీ చేస్తున్నారన్నారు. హుస్సేన్ సాగర్ కాపాడుకోవాలని విజయభాస్కర్ రెడ్డి కాలంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు, నెక్లస్ రోడ్ ఏర్పాటైందన్నారు. తొమ్మిదన్నరేళ్ల కాలంలో చెరువులను ఎందుకు కాపాడలేదని హరీష్ రావును కోందండరెడ్డి ప్రశ్నించారు. కేవలం ప్రబుత్వంపై విమర్శలు చేయడమే బిఆర్ఎస్ లక్ష్యంగా ఉందన్నారు. ప్రకృతిని కాపాడడానికి చెరువులు కాపాడాలన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి నీటిని తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ సర్కారే రానున్న 30 ఏళ్ల వరకు తాగునీటి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. ధర్మం కోసం భగవత్ గీతను కూడా స్ఫూర్తిగా తీసుకున్నా అని సీఎం రేవంత్ నిన్న చెప్పారన్నారు. హెచ్ఎండీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని కోదండరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్పు, పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు. హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని.. అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు.

అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివేతలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయ దుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

# బండ్లగూడ స్కూల్ కూల్చొద్దు

- కావాలంటే నాపై బుల్లెట్ల వర్షం కురిపించండి
- హైడ్రా చర్యలపై అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, ప్రజానావ :** హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి. పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని అక్బరుద్దీన్ సూచించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇతరులు కబ్జా చేసిన భూముల గురించి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. సీఎం రేవంత్.. మీకు దమ్ముంటే ఆ నిర్మాణాలు కూల్చివేయాలని ఓపెన్ ఛాలెంజ్ చేస్తున్నారు. పాతబస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి గుర్తుచేశారు. ఆ కబ్జాలు తొలగించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని అడిగారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ కాలేజీ నిర్మించారని గుర్తుచేశారు. ఆ కాలేజీని కూలుస్తారా అని అడిగారు. మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ సఖ్యంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓవైసీ కాలేజీని కూలగొడతారా అని మహేశ్వర రెడ్డి ఛాలెంజ్ చేశారు. మహేశ్వర రెడ్డి కామెంట్ చేశారో లేదో.. ఆ వెంటనే అక్బరుద్దీన్ ఓవైసీ స్పందించారు. ద యచేసి ఆ స్కూల్ కూల్చొద్దు అని కోరారు. పేద విద్యా ర్థుల ఆ పాఠశాల వరం లాంటిదని కోరారు. కొందరు కావాలనే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు.

# కాంగ్రెస్ అంటేనే మొండిచేయి

**రుణమాఫీపై మరోమారు కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్, ప్రజానావ :** రైతు రుణమాఫీ అంశంలో బీఆర్ఎస్ నేతల ఆరోపణలు ఆగడం లేదు. పూర్తి రుణ మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్నారు. కానీ రుణమాఫీ ఓ బోగస్ అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇప్పటికే ఈ పథకంపై అనేక విమర్శలు చేశారు. ఇంకా రైతులకు పూర్తిగా మాఫీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుల ఖాతాల్లో నగదు వేసినట్లు గొప్పలు చెప్పుకుంటుందని మండిపడు తున్నారు. తాజాగా రుణమాఫీ అంశంపై కేటీఆర్ మరోసారి స్పందించారు. రుణమాఫీ అయిన రైతులకన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా ఎందుకు మాఫీ కాలేదో చెప్పేవారు లేరంటూ ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు పంట సీజన్లు గడిచినా రైతుభరోసా ఇంకా షురూ చెయ్యలేదు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా ఆగస్టు దాటుతున్నా లబ్దిదారుల ఖాతాల్లో వెయ్యలేదు. కౌలు రైతులకు ఇస్తానన్న రూ. 15వేలు ఇంకా ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ. 12వేల హామీ ఇంకా అమలే చెయ్యలేదు. కాంగ్రెస్ అంటేనే మొండి చెయ్యి చూపించే పార్టీ అని తేలిపోయిందని అన్నారు.

**ఆరోగ్య ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్**

రాష్ట్రంలో డెంగీ మరణాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతుంది. కానీ వార్తా పత్రికల్లో మాత్రం ఒక్కరోజులో ఐదు మంది డెంగీతో చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. డెంగీతో మరో ముగ్గురు చనిపోయినట్లు ఇవాళ కూడా వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ డేటాను ఎవరు దాచిపెడుతున్నారు..? ఎందుకు దాచిపెడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవు.. చాలా హాస్పిటల్స్‌లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి, రాష్ట్రంలో హెల్త్ ప్రకటించాలని సీఎస్ శాంతికుమారికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రముఖుల కృష్ణాష్టమి శుభకాంక్షలు

**గవర్నర్, సీఎం, విపక్ష నేతల అభినందనలు**

**హైదరాబాద్, ప్రజానావ :** గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని వారు ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు. మానవ జీవితంలో 'గీత' బోధనలు ప్రభావశీలమైనవి. మానవుడి ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటాడు. ఆ శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని ప్రార్థిస్తున్నా' అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు!' అని కేసీఆర్ పోస్ట్ చేశారు. ' వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనమ్. శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ పేర్కొన్నారు.

**ఆలయాలకు పోటెత్తిన భక్తులు**

తెలుగు రాష్ట్రాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. శ్రీ కృష్ణుడి ఆలయాల ముందు భక్తుల రద్దీ నెలకొంది. హైదరాబాద్‌లో ప్రముఖ ఇస్కాన్ టెంపుల్, హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్, శ్రీ రాధాకృష్ణ దేవాలయం తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్ని కృష్ణయ్యకు ప్రీతిపాత్రమైన పాలు, నెయ్యి, వెన్న తదితర ఆహార పదార్థాలను నైవేద్యం సమర్పించడానికి క్యూ కట్టారు. తెలంగాణ, ఏపీలోని అన్ని జిల్లాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖులు ఆలయాల బాట పట్టారు.

# రాష్ట్రంలో వాతావరణ మార్పులు

**వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాల విజృంభణ**
**ఇప్పటికే ఆరుగురు మృత్యువాత**



**హైదరాబాద్, ప్రజానావ :** తెలంగాణలో వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో ఒకే రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవి పాడు గ్రామంలో ఈడుపుగంటి సామ్రాజ్యం (67) అనే మహిళకు వారం కింద జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అటు, ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ (50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల కిందటే ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కామారెడ్డి - సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి చెందిన మనస్విని (11)కి జ్వరం రాగా కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అటు, ఇదే కామారెడ్డి - సదాశివనగర్‌లో నరేశ్ (29) అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడు. అలాగే, కరీంనగర్ - ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (26) జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇతను స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురి కాగా కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే చనిపోయాడు. మరోవైపు, మహబూబాబాద్ - కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దంపతులు కుమార్తెకు 5 రోజుల కిందటే జ్వరం వచ్చి తగ్గింది. స్వగ్రామంలో పని ఉందని కూతురితో కలిసి వెళ్తుండగా.. దారిలో జ్వరం ఎక్కువై ఫిట్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఆమెను నర్సంపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రతి జ్వరాన్ని డెంగీ అని చెప్పి చికిత్స కోసం భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 'డెంగీ ఉదయం పూట కుట్టే ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఓ సాధారణ జ్వరం. ఇది కార్బో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తీవ్ర జ్వరం, తలనొప్పి, కంటి లోపలి భాగం నొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తాయి. ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. అవి 20 వేలకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలతో ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. మరికొందరు నిర్లక్ష్యంతో సొంత వైద్యం చేసుకుంటున్నారు. అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని వైద్యాధికారులూ సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో డెంగీ, విష జ్వరాల విజృంభణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఒక్కరోజులో 5 మంది డెంగీతో చనిపోయినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ డేటాను ఎవరు ఎందుకు దాచిపెడుతున్నారని ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవని.. చాలా ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.



# రాష్ట్రంలో రోగాలు..

## అధికార పార్టీ నేతల ఢిల్లీ పర్యటనలు

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం
- డెంగ్యూ నివారణకు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్

**సిద్దిపేట, ప్రజానావ:** రాష్ట్రంలో రోజురోజుకూ డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలి జనం రోగాలకు గురవుతుంటే ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికార పార్టీ నేతలు ఢిల్లీ పర్యటనలు చేయడం ఎంతవరకు సబబు అని మెదక్ ఎంపి రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా నాంచార్‌పల్లి గ్రామ శివారులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డెంగ్యూ నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డెంగ్యూ ప్రబలకుండా పారిశుద్ధ కార్యక్రమాల కోసం ప్రతి గ్రామానికి తక్షణమే రూ.50 వేలు మంజూరు చేయాలన్నారు. స్థానిక ఎన్నికలు వెంటనే నిర్వహించి పాలన కొనసాగేలా చూడాలన్నారు. హైడ్రాకు తాను వ్యతిరేకం కాదని, ఎంతటి వారైనా చెరువులు, కుంటలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అంబాటి బాలేష్ గౌడ్, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, విభూషణ్ రెడ్డి, కోడూరి నరేశ్ పాల్గొన్నారు.

# మన అత్యాశనే ఆసరాగా సైబర్ నేరగాళ్ల మోసాలు

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**సిరిసిల్ల, ప్రజానావ:** ఎప్పుడైనా, ఎక్కడైనా మనిషి అత్యాశను ఆసరాగా చేసుకొనే మోసాలు జరుగుతాయని, సైబర్ నేరగాళ్లు సైతం ఇలాగే ఒకటికి రెండు రెట్లు సంపాదించొచ్చని ఆశపెట్టి సర్వం దోచేస్తారని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ మల్టీలెవెల్ మార్కెటింగ్, చైన్ కంపెనీల ప్రచారాలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొందరు పోలీస్ అధికారుల ఫొటోలు డీపీగా పెట్టుకొని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీకు సంబంధించిన వాళ్లు పట్టుబడ్డారని, వాళ్ల పేరు మీద ఇల్లీగల్ డ్రగ్స్ కొరియర్లు వచ్చాయని, వాళ్లు ఇంకేదో పెద్ద తప్పు పనిచేశారని మిమ్మల్ని టెన్షన్‌లో బురిడీ కొట్టిస్తారని, అలాంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాన్నారు. మెసేజ్‌లు, అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయొద్దన్నారు. అనధికారిక లోన్ యాప్స్ నుంచి చిన్న క్లిక్‌తో మీకు లోన్ వస్తుందనుకుంటే పెద్ద అగాధంలో పడతారని, లోన్ ఇస్తున్నప్పుడు మీ ఫోన్లో డేటాను తస్కరించి అందులోని కాంటాక్టులకు అభ్యంతరకమైన మెసేజులు పంపుతారని హెచ్చరించారు.

#### జిల్లా పరిధిలో వారం రోజుల వ్యవధిలో సైబర్ కేసులు

- రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి యూట్యూబ్‌లో సింగపూర్ పంపిస్తాం అనే వీడియో చూసి అతని వాట్సాప్ కి కాంటాక్ట్ అవ్వడం జరిగింది. అతడు సింగపూర్‌లో ఆఫీస్ బాయ్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మొదటగా రిజిస్ట్రేషన్ కోసమని రూ.5వేలు పంపించమన్నాడు. తర్వాత వీసా ఖర్చుల కోసం అని చెప్పి రూ.1.40లక్షలు పంపమనగా బాధితుడు పంపించడం జరిగింది. తర్వాత బాధితుడిని వాట్సప్‌లో బ్లాక్ చేశారు.
- వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనధికార లింక్‌ను క్లిక్ చేయడంతో అతని మొబైల్ హాక్ చేయబడి అతనికి తెలియకుండానే అతని అకౌంట్ నుంచి రూ. 54,367 నష్టపోవడం జరిగింది.

కోనరావుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బజాజ్ ఫైనాన్స్ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి రూ.1 లక్ష లోన్ అప్రూవల్ అయిందని, దానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ఫ్రీ, పేపర్ ఛార్జెస్ ఇతర ఖర్చుల కోసమని చెప్పి బాధితుడి వద్ద నుంచి దాదాపుగా రూ.18వేలు తీసుకొని మోసం చేశారని ఎస్పీ వివరించారు.

### నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రిలో

# మరో దారుణం!

- ప్రసవం కోసం వచ్చిన గర్భిణిపై వైద్యురాలి దాష్టీకం
- బలవంతంగా ఆపరేషన్, మృతి చెందిన శిశువు

**నల్లగొండ, ప్రజానావ:** కుర్చీలో కూర్చొని మహిళ ప్రసవించిన దారుణ ఘటన జరిగిన రెండు రోజులకే నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మరో దారుణం వెలుగుచూసింది. డెలివరీ కోసం వచ్చిన గర్భిణిపై వైద్యురాలు దాష్టీకానికి పాల్పడ్డారు. మాడ్గులపల్లి మండలం గ్యారకుంట పాలెంకు చెందిన గర్భిణీ చెరుకుపల్లి శ్రీలత డెలివరీ కోసం రాగా.. వైద్యురాలు బలవంతంగా ఆపరేషన్ చేయడంతో శిశువు మృతి చెందింది. ఇటీవల ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల మందలింపుతో నిన్నటి (శనివారం) నుంచి వైద్య సిబ్బంది సరిగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో డెలివరీ కోసం శ్రీలత ప్రైవేట్ ఆసుపత్రిలో చేరేందుకు బయటికి వెళ్తుండగా మందలించిన వైద్యురాలు బలవంతంగా ఆపరేషన్ చేస్తానని నమ్మబలికినట్టు తెలుస్తోంది. వైద్యురాలు కోపంతో ఆపరేషన్ చేశారని, భయపడినట్టే ఆపరేషన్ చేసి శిశువును చంపారని బాధితుల ఆరోపిస్తున్నారు. ఈ దారుణ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంటుంది. కాగా రెండు రోజుల క్రితమే నల్లగొండ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో దారుణం వెలుగుచూసింది. ఆస్పత్రి డాక్టర్, నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిండు గర్భిణీ తాను కూర్చున్న కుర్చీలోనే ప్రసవించింది. నల్లగొండ జిల్లా నేరడుగొమ్ము మండలానికి చెందిన గర్భిణి నల్లవెల్లి అశ్వినికి నొప్పులు రావడంతో గురువారం రాత్రి 10గంటల సమయంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. అక్కడ డాక్టర్లు లేకపోవడంతో నర్సులు ఆమెను అంబులెన్స్ ఏర్పాటు చేసి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి 12.30 గంటలకు ఆమె అక్కడికి చేరుకోగా డా. నిఖితతో పాటు నర్సులు అశ్వినిని పరిశీలించి ప్రసవానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. అరగంట తర్వాత రెండోసారి బీపీని పరీక్షించి ప్రసవానికి ఇంకా సమయం ఉందని, అటూఇటూ నడవాలని సూచించారు. తెల్లవారు జామున 2 గంటల సమయంలో అశ్విని నడుస్తుండగా నొప్పులు అధికమై అక్కడే ఉన్న కుర్చీలో కూర్చోగా ఆ మరుక్షణమే ప్రసవించింది. అశ్విని తల్లి బిడ్డను గట్టిగా పట్టుకొని డాక్టర్లను పిలవగా నర్సులు వచ్చి వైద్య సేవలందించారు. అయితే బిడ్డకు మాత్రం ఎలాంటి ప్రమాదం జరగలేదు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రాజన్న సిరిసిల్ల జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వేములవాడలో జాబ్‌మేళా
- హాజరైన 46 కంపెనీలు.. తరలివచ్చిన యువతీయువకులు




**వేములవాడ, ప్రజానావ :** యువత వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆద్వర్యంలో వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్ వేదికగా ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాబ్‌మేళాకు దాదాపు 46 కంపెనీలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అక్కడ ఏర్పాటు చేసిన ఆయా సంస్థల స్టాళ్లను సందర్శించారు. ఆయా సంస్థల్లో ఎందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు? ఉద్యోగం చేసేది ఎక్కడ? చేసే పని ఏమిటి? వేతనాలు ఎంత ఇస్తారు? వసతి సౌకర్యంహకల్పిస్తారా తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఇటీవల టీచర్ల నియామకానికి మెగా డీఎస్సీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించి, కీ కూడా విడుదల చేసిందని తెలిపారు. అలాగే గ్రూప్-4 ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కూడా పూర్తి చేసి, మెయిన్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని వివరించారు. దాదాపు ఈ ఎనిమిది నెలల్లో 30వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తుచేశారు.

#### పక్కా ప్రణాళికతో ముందుకు

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఆయా ప్రైవేటు కంపెనీల్లో యువతకు కొలువులు ఇప్పించేందుకు జాబ్ మేళాలు చేపడుతున్నదని పేర్కొన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత వివిధ అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. యువత ఉద్యోగాలు ఎక్కడ వచ్చినా వెళ్లాలన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత, తల్లిదండ్రులు భాగస్వామ్యులు కావాలని కోరారు. జాబ్ మేళాలు ప్రతి ఆరు నుంచి ఎనిమిది నెలలకు ఒక్కసారి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, తహసీల్దార్ మహేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



#### 800 మందికి కొలువులు

మెగా జాబ్‌మేళాకు జిల్లాలోని పు 3వేల మంది యువతీ-యువకులు తరలివచ్చి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 1500 మంది ప్రాథమిక పరీక్షలకు ఎంపికయ్యారు. ఫైనల్ పరీక్ష, ఇంట ర్వ్యూల అనంతరం దాదాపు 48 కంపెనీలు 800 మందికి ఎంపిక చేయగా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు పంపిణీ చేసి, వారిని అభినందించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మరింత రాణించాలని ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు కృషి చేస్తా



**వేములవాడ, ప్రజానావ:** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ అనుబంధం) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే గట్టిపట్టున్న సంఘంగా గుర్తింపు పొందిన ఐజేయూ సమావేశానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఒక్కో విలేఖరి వెయ్యి మందితో సమానమని, తన గెలుపులో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ పొరపాట్లు జరగకుండా చూసుకునే శక్తి జర్నలిజానికి, అందులో పనిచేసే జర్నలిస్టులకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు గడుస్తునప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యంతో పదేళ్లలో జరిగిన నష్టం, విధ్వంసం గురించి తెలుసుకునేందుకే తమకు చాలా సమయం పట్టిందన్నారు. గత 30 ఏళ్లుగా హైదరాబాద్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర పునర్నిర్మానంలో భాగంగా అందరి సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు వెళ్తున్నామని, గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమంపై నిర్లక్ష్యం చేస్తే, తాము జర్నలిస్టులకు న్యాయంచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి నుంచి మొదలుకొని మండల స్థాయి విలేకరులకు సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేస్తారని పేర్కొన్నారు. జర్నలిస్టు సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తానని, అవసరమైతే లేఖ రూపంలో సమస్యలను రాసి సీఎంకు ఇచ్చి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

#### మీ సేవకుడిగా బాధ్యత తీసుకుంటా

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు వచ్చే విధంగా అందులోనూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కంటే వేగంగా ఇండ్లు వచ్చేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇండ్ల స్థలాలకు సంబంధించి విలేఖరులు ఆయా మండలాల్లో స్థానిక తహసీల్దార్లకు దరఖాస్తులివ్వాలన్నారు. ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇల్లు సైతం ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇండ్ల స్థలాలతో పాటు జర్నలిస్టులంతా ఏకతాటిపై వస్తే ప్రెస్‌క్లబ్‌లకు నిధులు మంజరూ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్వయం ఉపాధిలో భాగంగా జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ మహిళా సంఘాల సభ్యులైనటువంటి జర్నలిస్టు కుటుంబ సభ్యులకు త్వరితగతిన రుణాలచ్చేంఇదుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రభుత్వం అందించే హెల్త్ కార్డులతో పాటు జర్నలిస్టులకు ఆత్మగౌరవంగా హెల్త్ కార్డు ఇచ్చేందుకు శ్రీకారం చుడుతానన్నారు. మీ సేవకుడిగా ఈ బాధ్యత తీసుకుంటున్నాని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ముందు కాంగ్రెస్ నేతల నిర్మాణాలు కూల్చండి

- ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే సిఎం 'హైడ్రా'మా
- అసైన్డ్, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై శ్వేతపత్రం విడుదలకు డిమాండ్
- దమ్ముంటే స్థానిక ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ చేయాలి
- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



**సంగారెడ్డి, ప్రజానావ:** హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రామా చేస్తున్నారని బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సంగారెడ్డిలోని పార్టీ కార్యాయంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యను పక్కదోవ పట్టించడానికే సీఎం హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నారని వ్యాఖ్యానించారు. నిజంగా చెరువుల ఆక్రమణలపై చిత్తశుద్ధి ఉంటే, ముందుగా తన పార్టీ నేతలకు సంబంధించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సొంత తమ్ముడితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అనేకమంది నేతలపైన కూడా ఆరోపణలున్నాయని గుర్తు చేశారు. సొంత పార్టీ వారిపై మొదట చర్యలు తీసుకుని, ఆ తర్వాత ఇతరులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకరిద్దరూ సెలబ్రిటీలు, సామాన్యులపై చర్యలు తీసుకోవడం ద్వారా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ నిర్మాణాలకు అనుమతులెవరు ఇచ్చారు? వారిపై చర్యలున్నాయా? అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎన్ని చెరువుల్లో ఆక్రమణలు జరిగాయి? ఎంతమేరకు అసైన్డ్, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలపై ఏదో చేస్తున్నట్టుగా సంచలనం సృష్టించడం తగదన్నారు. సామాన్యులకు నష్టం జరిగితే, వారికి నష్ట పరిహారం సంగతేంటి అని ప్రశ్నించారు.

#### 40 శాతం రైతులకే రుణమాఫీ

రైతు రుణమాఫీ కేవలం 40 శాతం రైతులకే జరిగిందని, ఇంకా 60 శాతం రుణమాఫీ జరగాల్సి ఉందని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేసినట్టుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. దమ్ముంటే వెంటనే స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడోసారి దేశ ప్రధానిగా ఎన్నికయిన మోడీ పాలనతో దేశం మరింత శక్తిమంతంగా తయారవుతోందని అన్నారు. బీజేపీ సభ్యత్వం చురుగ్గా చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అంజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అదెల్లి రవీందర్, రమేశ్, కులకర్ణి, వెంకటనర్సింహారెడ్డి, రాములు, విజయ్ కుమార్, నరేన్ దేశ్‌పాండే, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.




# క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- హైదరాబాద్‌లో టీ టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- తెలంగాణ టీడీపీలో అన్ని కమిటీలు రద్దు
- ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి హైదరాబాద్ వస్తా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీపై నేతలకు దిశానిర్దేశం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** తెలంగాణలో తెలుగు దేశం పార్టీకి పూర్వవైభవం సాధించడమే లక్ష్యంగా టీటీడీపీ నేతలు, కార్యకర్తలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నేతలతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని టీడీపీ పాత కమిటీలన్నీ రద్దు చేశారు. ఇకపై అన్ని గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా సభ్యత్వాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని నేతలకు సూచించారు. సభ్యత్వాలను పెద్ద ఎత్తున నమోదు చేయించిన నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. తనకు రెండు రాష్ట్రాలు రెండు కళ్లవంటివని, రెండు ప్రాంతాలు సమ అభివృద్ధి చెందాలనేదే టీడీపీ అభిమతమని పేర్కొన్నారు. పార్టీ నుంచి నేతలు వెళ్లిపోయినా గ్రామాల్లో టీడీపీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. క్యాడర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అయితే ఈ సమావేశంలో టీటీడీపీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు చంద్రబాబు మాట్లాడుతూ 'మీ అందరినీ కలవడానికి వచ్చాను. తెలుగు ప్రజలు 45 ఏళ్లగా నన్ను ఆశీర్వదిస్తూ వస్తున్నారు. టీడీపీని బలోపేతం చేశారు. అందుకుతగినట్లే పార్టీ నిరంతరం ప్రజలకు సేవ చేస్తోంది. ఈ కార్యక్రమంలో టీటీడీపీని బలోపేతం చేయాలని నిర్ణయించాం. అడహాక్ కమిటీలు రద్దు చేశాం. కొత్త కమిటీలు వేస్తాం. ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తాం. పార్టీలో యువ రక్తానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. వారిని ప్రోత్సహిస్తాం. నాపైన రెండు భాధ్యతలు ఉన్నాయి. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడం, రాక్షస పాలనను అంతమొందించి రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగాలని నన్ను గెలిపించిన ఏపీ ప్రజలకు న్యాయం చేయడం. ఇకపై తెలంగాణకు ప్రతి 15 రోజులకొకసారి వస్తా. మీ అందరి అభిప్రాయాలు తీసుకుంటా. అందరి నిర్ణయాల మేరకే పార్టీలో నిర్ణయాలుంటాయని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇదిలాఉంటే ఎన్టీఆర్ భవన్‌లో సీనియర్ నటుడు బాబుమోహన్ చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దీంతో ఆయన టీడీపీలో చేరబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బాబుమోహన్ గతంలో బీఆర్ఎస్, ఆ తర్వాత బీజేపీ చేరిన విషయం తెలిసిందే.




# అనుమతులు ఎలా తీసుకున్నారు?

- చిత్రపురి కాలనీలో చట్ట విరుద్ధంగా 225 రోహౌస్ నిర్మాణాలు
- జీ ప్లస్ వన్ అనుమతి తీసుకొని.. జీ ప్లస్ టూ నిర్మాణాలు
- నిర్మాణాలపై 15 రోజుల్లో వివరణ ఇవ్వాలి
- మణికొండ మున్సిపల్ కమిషనర్ ఆదేశం
- వివరణ ఇవ్వకుంటే విల్లాలను నేలమట్టం చేస్తామని స్పష్టీకరణ

**రంగారెడ్డి బ్యూరో, ప్రజానావ:** మణికొండ మున్సిపాలిటీలోని చిత్రపురి కాలనీ అసోసియేషన్ కొంతకాలంగా పలు వివాదాల నడుమ కాలం వెల్లదీస్తోంది. కొద్దిరోజుల క్రితం చిత్రపురి కాలనీలో నిర్మించిన 225 రోహౌస్ విల్లాలకుగాను అనుమతులకు విరుద్ధంగా అదనంగా నిర్మించిన 7 విల్లాలను అధికారులు నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువకముందే, తాజాగా జీఓ నెం. నంబరు 658 రెవెన్యూ చట్ట ప్రకారం అక్కడ రోహౌస్ నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సదరు నిర్మాణాలపై అనుమతులు ఏ విధంగా తీసుకున్నారనే విషయాలపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేదంటే 225 విల్లాలను నేలమట్టం చేస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. దీంతో సినీ కార్మికుల గుండెల్లో గుబులు మొదలైంది. గత పాలకవర్గంలో దొంగచాటున అనుమతులను పొంది, జీ ప్లస్ వన్‌కు బదులు జీ ప్లస్ టూ నిర్మాణాలు చేపట్టారు.

ఫలితంగా గత పాలకవర్గం చేసిన తప్పులకు రూ.50 కోట్ల మేర నష్టం జరిగిందంటూ కొందరు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా చిత్రపురి కాలనీ అసోసియేషన్‌లో కొంతకాలంగా అవినీతి, రాజ్యమేలుతోందని, కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుండడంతో సామన్య సినీ కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితి నెలకొందని అధికారులు పలువురు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చొద్దు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**హన్మకొండ, ప్రజానావ:** హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సామాన్యుల ఇండ్లు కూలగొట్టడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హన్మకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో దశాబ్దాలుగా నివసిస్తున్న వారిలో ఇండ్ల నిర్మాణానికి అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హైడ్రాతో పేదలకు నష్టం జరుగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారే ఎమ్మెల్యేల పదవిని తక్షణమే రద్దు చేసే విధానం రావాలని అన్నారు. బీఆర్ఎస్ అస్తిత్వ పోరాటం చేస్తుందని, పలువురు ఎమ్మెల్యేలు ఆ పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపులతో గతంలో నష్టపోయినందున కాంగ్రెస్ కూడా వాటిని ప్రోత్సాహించవద్దని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌పై వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని సకాలంలో నెరవేర్చే దిశగా సాగాలన్నారు. నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు, పంచాయతీల్లో పనులకు పెండింగ్ బిల్లులు తదితర సుమారు రూ.70 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. సాకులు చెప్పకుండా అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలన్నారు.

# 65 సంఘాలతో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ

## చైర్మన్‌గా లచ్చిరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక




**ఖైరతాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆవిర్భవించింది. 65 ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేశారు. నగరంలోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, సీపీఎస్, పెన్షన్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డిని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పెద్దలు ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కార్మికుల హక్కులు హరించినా నాడు ఉన్న ఉద్యోగుల జేఏసీ నాయకులు నోరు మెదపలేదని ఆరోపించారు. ఉద్యోగ సంఘాలను, సంఘాల నేతలను ఉక్కుపాదంతో అణిచివేసినప్పుడు నాటి ఉద్యోగ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారని, జీవో 317తో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారని, అయినా గత జేఏసీ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీనే జీతాలు పడుతున్నాయని, ఉద్యోగుల కష్టనష్టాల గురించి సీఎం రేవంత్ రెడ్డికి సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు.

### మళ్లీ పునరావృతం కావొద్దనే..

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్యం, పదోన్నతుల క్యాలెండర్ అమలు, హౌసింగ్ పాలసీకి కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనాకాలంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పొరపాట్లు, ఉద్యోగులకు జరిగిన అన్యాయాలు మళ్లీ పునరావృతం కావొద్దనే ఆలోచనతోనే ఏకతాటిపైకి వచ్చినట్టు చెప్పారు. తాము ఆ సంఘాలకు పోటీగా ముందుకు రావడం లేదని, ఆ సంఘాల గుత్తాధిపత్యం రాచరికంలా ఉండొద్దని, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేయడానికి వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు నిర్మల, పీఆర్‌టీయూ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అశ్వత్థామరెడి తదితరులు పాల్గొన్నారు.



# ఘోష్ ఇంటిపై సీబీఐ దాడులు

- ఆర్జీ కర్ వైద్య కళాశాలపై ఆర్థిక అవకతవకల ఆరోపణలు
- 14 ప్రదేశాల్లో దర్యాప్తు సంస్థ సోదాలు

**న్యూఢిల్లీ:** కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డా. సందీప్ ఘోష్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి ఆయన ఇంట్లో సీబీఐ ఆదివారం సోదాలు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుడు, వారి సహచరుల ఇళ్లతో సహా 14 ఇతర ప్రదేశాల్లో కూడా కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలు సాగిస్తున్నదని వారు తెలిపారు. ఈ నెల 9న కళాశాల, ఆసుపత్రి సెమినార్ హాల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటనతో వైద్య కళాశాల మీడియా దృష్టిని ఆకర్షించింది. ఆ ఘటన సందర్భంగా ఒక ట్రాఫిక్ పోలీస్ వలంటీర్ సంజయ్ రాయ్‌ను అరెస్టు చేసిన విషయం విదితమే. ఆ కిరాతక ఘటన దేశవ్యాప్తంగా వైద్యులు, పౌరుల పరంగా నిరసన ప్రదర్శనలకు దారి తీసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాలపై సిబిఐ హత్య, ఆర్థిక అవకతవకలపై కేసులు నమోదు చేసింది. ఆర్జీ కర్ ఆసుపత్రిలో గతంలో పని చేసిన డిప్యూటీ సూపరింటెండెంట్ అఖ్తర్ అలీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌పై తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. ఆ కేసును కూడా కోర్టు సీబీఐకి బదిలీ చేసింది. మూడు వారాల్లోగా దర్యాప్తు స్టేటస్ నివేదిక సమర్పించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సందీప్ ఘోష్‌కు, మరి నలుగురికి శనివారం నిజ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇందు కోసం ఢిల్లీలోని ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నుంచి ప్రత్యేక బృందాలు వచ్చాయి. ఇది ఇలా ఉండగా, ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆసుపత్రి సమీపంలో నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకు కోల్‌కతా పోలీసులు పొడిగించారు.



# సాగర్‌కు భారీ వరద

- నిండుకుండలా మారిన జలాశయం
- రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**నాగార్జునసాగర్, ప్రజానావ:** నాగార్జునసాగర్ డ్యాం అనుకున్న దాని కంటే ముందే వరద ప్రవాహం రావడంతో ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో సాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం ఉండడంతో ఆదివారం ఉదయం ఎన్ఎస్‌పి అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 589.50 అడుగుల వద్ద నీరు నిల్వ ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 311 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,988 క్యూసెక్కుల నీటిని కుడి కాలువ ద్వారా 9067 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 18000 క్యూసెక్కుల నీటిని, లోలెవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు. మొత్తం ఇన్‌ఫ్లో 48,744 క్యూసెక్కులు కాగా, రిజర్వాయర్ నుంచి మొత్తం 48,744 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# రూ.175 కోట్లు మాయం!

- పాతబస్తీ కేంద్రంగా భారీ సైబర్ క్రైమ్
- షంషీర్‌గంజ్ ఎస్‌బీఐలో ఆరు బ్యాంకు ఖాతాల గుర్తింపు
- పేదల పేరుతో ఖాతాలు.. క్రిప్టో కరెన్సీతో డబ్బులు దుబాయ్‌కి తరలింపు
- ఇద్దరిని అరెస్టు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** హైదరాబాద్ కేంద్రంగా భారీగా సైబర్ క్రైమ్ కుంభకోణం పాల్పడినట్లు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ నేరగాళ్లకు సహకరించిన ఇద్దరు బ్యాంకు నుంచి రూ.175 కోట్లు లావాదేవీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో డేటా విశ్లేషించగా పాతబస్తీలోని షంషీర్‌గంజ్ ఎస్‌బీఐ శాఖలోని ఆరు బ్యాంకు ఖాతాల ఫిర్యాదులను గుర్తించింది. ఈ ఖాతాల ద్వారా రెండు నెలల స్వల్ప వ్యవధిలో పెద్ద మొత్తంలో డబ్బు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఖాతాదారులు పెద్ద ఎత్తున సైబర్ మోసాలకు పాల్పడి అవక తవకలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ ఖాతాలకు దాదాపు 600 ఫిర్యాదులు లింక్ గుర్తించారు. ప్రధాన నిందితుడు దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అతనికి చెందిన ఐదుగురు సహచరులు పేద ప్రజలను బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు, సైబర్ నేరాలు, హవాలా కార్యకలాపాలకు కమీషన్ ప్రాతిపదికన ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకు ఖాతాలు తెరవడంలో అవసరమైన అన్ని పత్రాలను సిద్ధం చేయడంలో మహమ్మద్ షోయబ్ తౌకీర్ అనే వ్యక్తి కీలక పాత్ర పోషించినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు నిర్ధారించారు. ఖాతాలు తెరిచిన తర్వాత, చెక్కులపై ఖాతాదారుల సంతకాలు చేయించాడు. ఆపై వాటిని సహచరులలో ఒకరి కస్టడీలో ఉంచారు. కొంత డబ్బును క్రిప్టో కరెన్సీ ద్వారా దుబాయ్‌కి పంపించారు. ప్రధాన నిందితుడి ఆదేశాలను అనుసరించి సహచరులు డబ్బును విత్ డ్రా చేశారు. షోయబ్‌తో పాటు ఇతర సహచరులు కొంతమంది పేద వ్యక్తులను ఫిబ్రవరి 2024లో ఎస్‌బీఐ షంషీర్‌గంజ్ బ్రాంచ్‌లో ఆరు కరెంట్ ఖాతాలను తెరిచేందుకు ఒప్పించి, కమీషన్ల ఆశ చూపించారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో, ఈ ఆరు ఖాతాలలో రూ. 175 కోట్లు లావాదేవీలు సైబర్ పోలీసులు గుర్తించారు. సైబర్ నేరగాళ్ల కోసం పనిచేసిన మహ్మద్ షోయబ్ తౌకీర్, మహ్మద్ బిన్ అహ్మద్ బవాజీర్‌లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేరొకరి కోసం బ్యాంకు ఖాతా తెరవ వద్దని, అనుమానాస్పద లావాదేవీలలో పాల్గొనవద్దని హెచ్చరిస్తున్నారు. బ్యాంకు ఖాతాలను తెరవడానికి అయాచిత ఆఫర్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఖాతాను తెరవమని, ఖాతా కార్యకలాపాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించమని పోలీసులు సూచిస్తున్నారు. పెరిగిన టెక్నాలజీని ఆసరాగా చేసుకుని ఇటీవల సైబర్ క్రిమినల్స్ రెచ్చిపోతున్నారు. ఓటీపీ, లింక్ ల పేరుతో క్షణాల్లోనే కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు.

# ప్రభాస్ సెట్‌లో ఎనర్జీ తీసుకొస్తారు..

## 'రాజాసాబ్' హీరోయిన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..

కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ చియాన్ నటించిన తంగలాన్ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో హీరోయిన్ మాళవిక మోహనన్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. త్వరలోనే రాజాసాబ్ తో తెలుగు అడియన్స్ ముందుకు రానుంది. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న రాజాసాబ్ చిత్రంలో మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుంది.కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ చియాన్ నటించిన తంగలాన్ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో హీరోయిన్ మాళవిక మోహనన్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. త్వరలోనే రాజాసాబ్ తో తెలుగు అడియన్స్ ముందుకు రానుంది. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న రాజాసాబ్ చిత్రంలో మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుంది. ఇందులో ప్రభాస్ హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీతోనే టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుంది మాళవిక. తాజాగా ఓ ఇంటర్వ్యూలో డార్లింగ్ గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. కల్కి విడుదలకు ముందే రాజాసాబ్ మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యిందని.. ప్రభాస్ సెట్‌లోకి అడుగుపెడుతూనే ఎనర్జీని తీసుకువస్తారని తెలిపింది. డార్లింగ్ కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పనిని భారంగా కాకుండా ఎంజాయ్ చేస్తుంటారని.. అందరిని ఆప్యాయంగా పలకరిస్తారని తెలిపింది. పాన్ ఇండియా హీరో అయినా ఏమాత్రం గర్వం లేదని.. పైగా రెట్టింపు ఉత్సాహంతో షూటింగ్ లో పాల్గొంటారని చెప్పుకొచ్చింది. డార్లింగ్ పక్కన నటిస్తూ తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం కావడం చాలా సంతోషంగా ఉందని.. రాజాసాబ్ కచ్చితంగా హిట్ అవుతుందని తెలిపింది. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో రాబోతున్న ఈ లో మాళవికతోపాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.





## పవర్ స్టార్‌ని కలిసిన నిర్మాతలు..

ఎలక్షన్లు పూర్తయ్యాక మిగిలిన వాళ్లందరూ ల మీద ఇష్టాన్ని ఏదో రకంగా చాటుకుంటూనే ఉన్నారు. మీరు కూడా త్వరలోనే మొదలుపెట్టండి బాసూ అని రిక్వెస్టులు పెట్టుకుంటున్నారు పవన్ కల్యాణ్ ఫ్యాన్స్. పవర్‌స్టార్ ప్రెజెంట్ ల నిర్మాతలైతే మరో అడుగు ముందుకేసి ఆయన్ని కలిసొచ్చారు. ఎలక్షన్లు పూర్తయ్యాక మిగిలిన వాళ్లందరూ ల మీద ఇష్టాన్ని ఏదో రకంగా చాటుకుంటూనే ఉన్నారు. మీరు కూడా త్వరలోనే మొదలుపెట్టండి బాసూ అని రిక్వెస్టులు పెట్టుకుంటున్నారు పవన్ కల్యాణ్ ఫ్యాన్స్. పవర్‌స్టార్ ప్రెజెంట్ ల నిర్మాతలైతే మరో అడుగు ముందుకేసి ఆయన్ని కలిసొచ్చారు. ఫస్ట్ గ్లింప్స్ తోనే అదిరిపోయే హైప్ పెంచేశారు ఓజీ మేకర్స్. ఓజీ విడుదలవుతుంది... చూద్దురుగానీ అని పవన్ చెప్పిన ఒక్క మాటతో కోసం ఎదురుచూస్తున్నారు అభిమానులు. దాదాపు 300 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతోంది ఓజీ. పవర్‌స్టార్ కెరీర్‌లో ఎక్కువ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఇదే. ఓజీ మేకర్స్ వెళ్లి కలిసిన వెంటనే హరిహరవీ-రమల్లు మేకర్స్ కూడా పవర్‌స్టార్‌ని మీట్ అయ్యారు. ఈ ఏడాదిలోగా ఈ ను విడుదల చేస్తారనే టాక్ ఎప్పటి నుంచో ఉంది. దానికి తగ్గట్టుగానే ఎగ్జయిటింగ్ అనౌన్స్ మెంట్స్ వరుసలో ఉన్నాయంటూ ఊరిస్తున్నారు మేకర్స్ 200 కోట్లతో తెరకెక్కుతోంది హరిహరవీరమల్లు. పవర్‌స్టార్ కెరీర్‌లో ఫస్ట్ ప్యాన్ ఇండియా గా ప్రమోట్ అవుతోంది హరిహరవీరమల్లు. ఈ లో నిధి అగర్వాల్ కథానాయకిగా నటిస్తుంది. ఓజీ, హరిహరవీరమల్లు లు పూర్తయిన తర్వాత ఉస్తాద్ భగత్‌సింగ్ గురించి ఆలోచిస్తారు పవన్ కల్యాణ్. ఇందులో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్. ఆ తర్వాతే సురేందర్‌రెడ్డి లైన్‌లో ముందుకు జరిగేది.



## మత్తు కళ్ళ అనసూయ..

అనసూయ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకం చెప్పాల్సిన పని లేదు.. సోషల్ మీడియా లో నిత్యం హాట్ ఫోజులతో అందరిని ఆకట్టుకుంటుంది. బుల్లితెరకు దూరమై వెండి తెరపై నటిస్తూ అలరిస్తుంది. 20 ఏళ్ల కింద వచ్చిన ఎన్టీఆర్ నాగ సమయంలోనే సిల్వర్ స్క్రీన్ పై కనిపించింది అనసూయ. తర్వాత కొన్నేళ్లకు న్యూస్ ప్రజెంటర్ మారి ఆ తర్వాత జబర్దస్త్ కామెడీ షో లో యాంకర్‌గా చేసి మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది అనసూయ. అనసూయ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకం చెప్పాల్సిన పని లేదు.. సోషల్ మీడియా లో నిత్యం హాట్ ఫోజులతో అందరిని ఆకట్టుకుంటుంది. బుల్లితెరకు దూరమై వెండి తెరపై నటిస్తూ అలరిస్తుంది. 20 ఏళ్ల కింద వచ్చిన ఎన్టీఆర్ నాగ సమయంలోనే సిల్వర్ స్క్రీన్ పై కనిపించింది అనసూయ.తర్వాత కొన్నేళ్లకు న్యూస్ ప్రజెంటర్ మారి ఆ తర్వాత జబర్దస్త్ కామెడీ షో లో యాంకర్‌గా చేసి మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది అనసూయ. తర్వాత నెమ్మది గా ల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. పలు లేడీ ఓరియెంటెడ్ ల్లో నటిస్తోంది అనసూయ. అనసూయ తన ఫ్యామిలీ తో కలిసి వెళ్లిన ట్రిప్ కు సంబంధించిన ఫోటోలను, వీడియోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటుంది. అనసూయ వెండితెరపై వరుస ఆఫర్లతో బిజీగా ఉండటం తో బుల్లి తెరకు బై చెప్పి చెప్పేసింది. ఈ జబర్దస్త్ భామ కాల్ షీట్స్ కోసం దర్శకనిర్మాతలు క్యూ కడుతున్నారు. వరుస లతో అందరిని అలరిస్తోంది అనసూయ భరధ్వాజ్. ప్రస్తుతం అల్లు అర్జున 'పుష్ప2 ది రూల్' లో నటిస్తోంది.

# హైడ్రా అంటేనే హడలిపోతున్న ఆక్రమణదారులు

**ఆక్రమణదారులు ఎవరైనా చర్యలు తప్పవన్న సంకేతాలు**

**ప్రభుత్వంపై ప్రజల్లో భారీగా సానుకూల స్పందన**

**గండిపేటలో అనుకూలంగా యువత ప్రదర్శనలు**

**కొత్తగా ఇప్పుడు ఓవైసీ వంతు రావడంతో సవాళ్లు**



**హైదరాబాద్, ప్రజానావ :** హైడ్రా.. ఇప్పుడు ఈ పేరు వింటే చాలామంది హడలిపోతున్నారు. హైదరాబాద్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో దీనిపైనే చర్చ జరుగుతోంది. ఆక్రమణల తొలగింపు పర్వాన్ని హైడ్రా గత కొన్ని వారాల ముందు నుంచే చేపట్టగా.. హీరో నాగార్జునకు చెందిన హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను కూడా హైడ్రా కూల్చివేయడంతో ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే ఉంది. రాజకీయ పార్టీలు కూడా విభిన్న రీతిలో దీనిపై స్పందిస్తున్నాయి. కాగా హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు తమ కట్టడాలు కూల్చేస్తాయో అని హైదరాబాద్‌లోని చాలా మంది టెన్షన్ పడుతున్నారు. హైడ్రాతో ప్రభుత్వం పొలిటికల్ గేమ్ ఆడుతోందని విపక్షాలు విమర్శిస్తుంటే.. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా.. తగ్గేదేలే అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తేల్చేశారు. అటు ఆక్రమణల తొలగింపునకు హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు కొన్ని వర్గాల నుంచి మద్ధతు లభిస్తోంది. కెసిఆర్ హయాంలోనే ఎన్ కన్వెషన్ కూలుస్తారని అనుకున్నారు. కానీ ఏదో మతలబు జరగడంతో ఆగిపోయింది. నాగార్జున కూడా ఇక తనకు ధోకా లేదని,కెసిఆర్‌తో అంటకాగారు. ఈ క్రమంలో ఇప్పుడు హైడ్రా నిర్ణయాలపై రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు లభిసతోంది. ఎవరు ఆక్రమణ దారులైనా చర్యలు తీసుకోండని ప్రజల్లో సానూకూలత వస్తంది. రేవంత్ సర్కార్ నిర్ణయాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు. ఈ క్రమంలో హైడ్రాకు మద్దతుగా గండిపేట వెల్ఫేర్ సొసైటీ సపోర్ట్ వాక్ నిర్వహించింది. ఈ సపోర్ట్ వాక్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రజలు మద్దతు తెలిపారు. ఈ వాక్‌లో భారీగా స్థానికులు, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. చెరువులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ మనది హైడ్రా మనందరిదీ అనే నినాదాలు చేశారు. హైదరాబాద్ లో అక్రమకట్టడాలను హైడ్రా కూల్చివేస్తుండటంతో.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తమ కట్టడాలను కూడా కూల్చివేస్తారా ? అని భయపడు తున్నారు. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ తోపాటు పలువురి అక్రమకట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. దీంతో సోషల్ మీడియాలో హైడ్రా కూల్చివేతలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. చెరువులను కబ్జా పెట్టి నిర్మించారంటూ పలువురు.. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందులో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసికి చెందిన బిల్డింగ్‌లు కూడా ఉన్నాయి. బండ్లగూడలోని ఫాతిమా ఒవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందని వార్తలు వస్తుండటంతో ఆయన స్పందించారు. 'పేదలకు ఉచిత విద్యనందించేందుకు 12 బిల్డింగ్‌లు నిర్మించా. కొందరు వీటిపై వక్రదృష్టి పెట్టారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బు÷-లలెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. కానీ పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడ కండి' అని అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఇక, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు తమ కాలేజీలను చెరువులను కబ్జాచేసి కట్టారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో వాటిని కూడా హైడ్రా కూల్చివేసేందుకు సిద్ధమైతున్నట్లు సమాచారం. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పష్టం చేశారు. అధర్మం ఓడాలంటే యుద్ధం తప్పదన్న కృష్ణుడి మాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. శ్రీకృష్ణ భగవానుడి బోధనానుసారం చెరువులను కాపాడుతున్నామని ఆయన తెలిపారు. మహానగరంలో చెరువులను చెరబట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ వెల్లడించారు. నిజాం ఆనాడే హైదరాబాద్‌ను లేక్ సిటీగా గుర్తించి గొలుసుకట్టు చెరువుల నిర్మాణాలు చేపట్టారని సిఎం రేవంత్ తెలిపారు. కరువు వచ్చిన సమయంలో గండిపేట, ఉస్మా న్ సాగర్ హైదరాబాద్ దాహార్తిని తీర్చుతున్నాయని, కానీ, కొందరు ధనవంతులు చెరువుల పక్కనే ఫాంహౌస్‌లు కట్టుకొని, ఆ నాలాలు గండిపేటలో కలిపారని, ఇప్పుడు వాటిని తాగునీటిగా ఉపయోగించేందుకు ఇబ్బందిగా మారిందని సిఎం రేవంత్ తెలిపారు. అలాంటి అక్రమ నిర్మాణాలను వదిలేస్తే ప్రజా ప్రతినిధిగా తాను విఫలమైనట్లేనని, అందుకే ఎవరు ఎంత ఒత్తిడి చేసినా మిత్రులకు ఫాంహౌజ్ లు ఉన్నా హైడ్రా అనే సంస్థను ఏర్పాటు చేసి, చెరువులను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ అన్నారు. ప్రకృతి విధ్వంసం చేస్తే ప్రకృతి విలయం ఎలా ఉంటుందో చూస్తున్నామని, ఇప్పటికే చెన్నై ఉత్తరాఖండ్, వయనాడ్‌లలో ఏం జరిగిందో చూశామని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ ను రక్షించుకోవాల్సిన బాధ్యత మన పై ఉందని, ఇందులో భాగంగానే చెరువులను రక్షణను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని, ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం హెచ్చరించారు. ఇకపోతే హైడ్రా తీసుకున్న చర్యలు, కాపాడిన భూముల వివరాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి చేరింది. గత రెండు నెలల నుంచి చెరువుల్లో, పార్కుల్లో, ప్రభుత్వ భూముల్లో చేపట్టిన కూల్చివేతలు, కాపాడిన భూముల వివరాలను ఆ నివేదికలో వివరించారు. ఆదివారంప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన నివేదికను అందజేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 8 మునిసిపల్ కార్పొరేషన్‌లు, 20 మునిసిపాలిటీలు, 33 పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదుల మే-రకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. జూన్ 27 నుంచి ఈనెల 24 వరకు చేపట్టిన కూల్చివేతలకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. కూల్చివేతలు చేపట్టిన 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. హైడ్రా తీసుకున్న చర్యల్లో ముఖ్యంగా చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లతో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయని, ఇందులో పలువురు రాజకీయ నేతలు, సినీనటులు, క్రీడాకారులు కూడా ఉన్నట్టు హైడ్రా నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌ఓసిలు లేవు. అనుమతులు అంతకన్నా లేవు. కోర్టు కేసులు, క్రమబద్ధీకరణ లేకుండానే చెరువులను ఆక్రమించు కోవడం, నిర్మాణాలను చేపట్టడం ఈ చర్యలతో బహిర్గతమైనట్టు తెలిపినట్టు సమాచారం.

వచ్చిన ఫిర్యాదులను పరిగ ణలోకి తీసుకుని, సమగ్రంగా విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సందర్భంలో తెలియజేసి నట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొంద రు కేసులని, అనుమతులు ఉన్నాయని, ఎన్‌ఓసి లు తీసుకున్నామని చెబుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు రంగనాథ్ తెలిపారనేది సమాచారం. చింతల్ చెరువులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను నేలమట్టం చేసి 3 ఎకరాల 5 గుంటల భూమిని స్వాధీనం చేసుకు న్నట్టు ఆ నివేదికలో పొందుపరిచారు.



# హైడ్రా కూల్చివేతలతో ఉలిక్కిపాటు

**బీఆర్ఎస్‌కు నిద్దర పట్టడం లేదా?**

**సీఎం రేవంత్ లక్ష్యంగా ఎదురుదాడి రాజకీయాలు**

**ప్రజలు ఈసడించుకుంటున్నా..అవే విమర్శలు**

**హైదరాబాద్, ప్రజానావ :**

పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన బీఆర్ఎస్‌కు నిద్రపట్టడం లేదు. ప్రధానంగా కెసిఆర్ కుటుంబానికి, వారిని నమ్ముకున్న ఒకరిద్దరు రాజకీయ నేతలకు అస్సలు నిద్రపట్టడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత.. సీఎం రేంవత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, కార్యక్రమాలు, అమలు చేస్తున్న తీరు, చేపడుతున్న చర్యలతో బీఆర్ఎస్ నేతలకు నరంమీద పుండు సల్పినట్లుగా ఉంది. తట్టుకోలేక పోతున్నారు. రుణమాఫీని తట్టుకోవడం లేదు. హైడ్రా కూల్చివేతలను అస్సలు తట్టుకోవడం లేదు. ఎలాగైనా రేవంత్‌ను టార్గెట్ చేయాలన్న లక్ష్యంతా విమర్శలకు దిగుతున్నారు. తమపై వచ్చిన అవినీతి ఆరోపణలను పక్కన పెట్టి ఎదురుదాడి రాజకీయాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగితే ఇక తమకు మనుగడ ఉండదన్న భావనలో, భయంలో ఉన్నారు. రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే సిఎంగా రేవంత్ రెడ్డి ఉండకూడదన్నదే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల పాలసీగా ఉంది. అందుకే ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి భయపడుతున్నారు. విమర్శల కు పదను పెడుతున్నారు. ఒకటి తమ అవినీతి, అక్రమాలు బయటపడకుండా చూసుకోవడంతో పాటు... రేవంత్‌పై బురదజల్లే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. హైడ్రా కూల్చివేతలను స్వాగతించాల్సిన నేతలు విమర్శలు చేస్తున్నారు. పార్టీ మారడం కోసం పల్లా రాజేశ్వర రెడ్డిని వేధిస్తున్నారని హరీష్ రావు చేసిన విమర్శలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. పల్లా రాజేశ్వర రెడ్డి కాలేజీ అక్రమంగా ఎందుకు కట్టాడో నిలదీయకుండా సిఎం రేవంత్‌రెడ్డిని నిలదీయడం వారి దౌర్భాగ్యాన్ని సూచిస్తోంది. గత పదేళ్లుగా అక్రమాలను ప్రోత్సహించిన ఆనాటి మంత్రులు ఇప్పుడు కూడా అదే సాగాలని చూస్తున్నారు. అందుకే రేవంత్ సిఎంగా ఉన్నంత కాలం తెలంగాణలో భారత రాష్ట్ర సమితి మనుగడ కష్టమనే భావనలో ఉన్నారు. అందుకే ప్రజా సమస్యలను పక్కన పెట్టిమరీ భారాస నేతలు కేవలం రేవంత్ రెడ్డినే టార్గెట్ చేసుకున్నారు. భారాస శ్రేణులను ప్రేరేపించడానికి, కాంగ్రెస్ శ్రేణులను రెచ్చగొట్టడానికి కెటిఆర్, హరీష్ వంటి వారు వ్యూహరచన చేస్తున్నారు. రుణమాఫీ పేరుతో ఆందోళనలకు దిగడం, పల్లా రాజేశ్వర రెడ్డిని పక్కన పెట్టుకుని విమర్శలు చేయడం వంటివన్నీ ఇందులో భాగంగానే చూడాలి. ఉద్యమ సమయంలో మాదిరిగా సమయం చూసుకొని కాంగ్రెస్‌లో అవంతర్గత చిచ్చు రాజేయాలని పన్నాగం పన్నుతున్నారని అనిపిస్తోంది. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీపై, సంక్షేమం పట్ల ప్రభుత్వం పై పోరాడాల్సిన నైతిక బాధ్యతను భారాస విస్మరించి తమ తప్పులను కప్పిపుచుకునేలా, రేవంత్‌ను తిట్టిపోయడమే లక్ష్యంగా రాజకీయాలు నడుపుతుందనే వాదనలు వస్తున్నాయి. ÷ూష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి నేతలు రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రతిపక్ష హోదాను తుంగలో తొక్కి, కాంగ్రెస్ ప్రభుత్వంపై కక్ష సాధింపు ధోరణిగా వ్యవహరించడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్య పరుస్తోంది. ప్రజా సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి పోరాడాల్సిన భారాస నేతలు కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాత్రమే టార్గెట్‌గా చేసుకోవడం రాజకీయ ఎత్తుగడలో భాగంగానే చూడాలి. గతంలో మీరే ముఖ్యమంత్రి కావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉచిత సలహాలు ఇవ్వడం, ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమం పై కొర్రీలు పెట్టే ప్రకటనలు చేయడం, రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గం పనితీరుపై పనిగట్టుకొని ఊహాజనిత ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని సైతం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు.కెటీఆర్, హరీష్‌రావు లు అదేపనిగా రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, విమర్శలు చేయడం, మీడియా సమావేశాలు, ట్విట్టర్లు వంటివి ఉపయోగించడం ఈ మధ్య అధికమైంది. మొన్న ఆర్టీసీ బసుల్లో ఆడపడుచులపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యాలు కూడా ఆయనలోని అసహనాన్ని బహిర్గతం చేశాయి. అయితే వ్యతిరేకత తీవ్రంగా ఆరవడవం, మహిళా కమిషన్ నోటీసులతో ఒక్కసారిగా నాలుక కరుచుకున్నారు.రైతు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా అంటూ గతంలో హరీష్ రావు ముఖ్యమంత్రికి విసిరిన సవాల్ చేసి భంగపడ్డాడు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు దశల్లో రుణమాఫీ చేసిన సంగతి తెలిసి కూడా దానిపై పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారానికి భారాస తెరలేపే ప్రయత్నం చేసింది. రైతుల పేరుతో ఆందోళనలకు దిగింది. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రాజీనామా చేయాలంటూ ఏకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం భారాస అసమనానికి పరాకాష్టగా కనిపిస్తోంది. మొన్న రేవంత్ రెడ్డి అధికారిక అమెరికా పర్యటనను కూడా కెటీఆర్ రాజకీయం చేయాలని ప్రయత్నించడం రేవంత్ పై వ్యక్తి గత కక్షకు అద్దం పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మానసికంగా స్థిరంగా లేరని కేటీఆర్ చేసిన ఘాటైన మాటలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుంది. భారాస నేతలు చెచ్చిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఫలితమే సిద్దిపేటలో హరీష్ రావు కార్యాలయంపై దాడిగా చూడాలి. భారాస నేతలు ఈ స్థాయిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కార్యక్రమాలు చేస్తున్నారో అందుకు ధీటుగా కాంగ్రెస్ శ్రేణులు ప్రతిఘటించే చర్యలకు దిగడం నిజంగా ఆందోళన కలిగించే అంశం. ప్రతిపక్షం నుంచి ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఏమో గానీ శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఏతావాతా రాజకీయాల్లో ఇప్పుడు సిఎంగా రేవంత్ ఉండడాన్ని బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదు. తమ ఉనికికి ముప్పుగా తయారైన రేవంత్‌ను తప్పించే వరకు ఎత్తులు వేస్తూనే ఉంటారు. యాగీ చేస్తూనే ఉంటారు.

# రాయదుర్గంలో ఆక్రమణల కూల్చివేత



**హైదరాబాద్, ప్రజానావ:** నగరంలో హైడ్రా కూల్చివేతలు ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. వరసగా కూల్చివేతలు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా నిద్రపోతోంది. పేద, ధనిక, సినిమా స్టార్లు, రాజకీయ నేతలు ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తోంది. ప్రభుత్వ స్థలాన్ని అంగులం ఆక్రమించిన తీవ్రం గా స్పందిస్తోంది. తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయ దుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టారంటూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. అధికారులతో స్థానికులు వాగ్వాదా నికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసు లు భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కూల్చి వేతల పర్వం సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణెళి లక్ష్యంగా ఆ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలో జనాభా పెరిగిపోతుండడంతో ఇష్టాను సారంగా చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇన్నాళ్లూ ఆక్రమణదారులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగింది. హైడ్రా రావడంతో నగర పరిధిలో చర్యలు చేపడుతోంది. ఇటీవల సినీనటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను అధికారులు కూల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయితే ఈ లోపే అధికారులు దాన్ని నెలమట్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్శిటీపై కూడా ఆరోపణలు వచ్చాయి. అక్రమంగా భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు అధికార పార్టీ నేతలను సైతం హైడ్రా వదిలిపెట్టడం లేదు. ఇలా చిన్నా, పెద్ద తేడా లేకుండా హైడ్రా ఆక్రమణదారుల బెండు తీస్తోంది.

# దేశంలోనే క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ

- క్రీడలకు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తాం
- క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రణాళికలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో మైదానాలను తీర్చిదిద్దుతాం
- మారథాన్ 2024 బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** దేశంలోనే క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్రీడల్లో ఆదర్శంగా నిలబడాల్సిన హైదరాబాద్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ స్థాయికి చేరుకోలేకపోయిందని, క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోందన్నారు. తెలంగాణ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియంలో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో స్పోర్ట్ హబ్‌గా గచ్చిబౌలి స్టేడియంలో 2000లో ఏషియన్ గేమ్స్ వంటి చాలా ఈవెంట్స్‌ను ఆర్గనైజ్ చేశామని గుర్తుచేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాల్సిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో ఈ దేశానికి క్రీడల్లో ఆదర్శంగా నిలవాల్సిన హైదరాబాద్ నేడు ఆ ప్రాధాన్యత నుంచి పక్కకు జరిగిందన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ప్రపంచకప్ విజేత క్రికెటర్ సిరాజ్‌కు గ్రూప్–1 ఉద్యోగం, భూమి, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల నగదు, డీఎస్పీ కేడర్ పోస్టును కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం కింద ఇచ్చినట్టు ముఖ్యమంత్రి రేవంత్ గుర్తు చేశారు. క్రీడలకు మళ్లీ పూర్వవైభవం తీసుకొచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్‌ను దూరదృష్టితో 25 ఏళ్ల క్రితమే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్లు తెలిపారు. ఈ స్పోర్ట్ విలేజ్ మళ్లీ క్రీడా కార్యక్రమాలకే వినియోగించాలని ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో మనం అంత గొప్పగా రాణించలేకపోయమని, మళ్లీ 2028లో ఒలింపిక్స్ తెలంగాణ రాష్ట్రం నుంచి అధిక మెడల్స్ సాధించాలన్న లక్ష్యంతో నేడు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేలా ఆలోచన చేస్తున్నామన్నారు. డిగ్రీ పట్టాలతోనే ఉద్యోగాలు రావని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిందన్నారు.

### సౌత్ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఒప్పందం

ఇటీవల సౌత్ కొరియా స్పోర్ట్ యూనివర్సిటీని సందర్శించానని, ఆ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడటం, తెలంగాణలో క్రీడలను అభివృద్ధి చేయాలని వారితో ఒప్పందం చేసుకున్నామని సీఎం వెల్లడించారు. అందరి ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని తెలంగాణలో వచ్చే అకాడమిక్ సంవత్సరంలోనే ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఆలోచనతో ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా శనివారం ఢిల్లీలో కేంద్ర క్రీడా శాఖ మంత్రిని కలిసినట్లు సిఎం రేవంత్ తెలిపారు. రాబోయే కేల్ ఇండియా స్పోర్ట్, నేషనల్ స్పోర్ట్ ఈవెంట్ తెలంగాణకు ఇవ్వాలని, వాటిని అద్భుతంగా నిర్వహిస్తామని విజ్ఞప్తి చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

### అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణ

2036లో జరగబోయే ఒలింపిక్స్ గేమ్స్‌ను భారత్‌లో నిర్వహించాలని ప్రధాని మోడీ ఆలోచనగా ఉందన్నారు. ఒలింపిక్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మన మైదానాలను తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రికి తెలిపామన్నారు. ఈ నేపథ్యంలోనే ఉప్పల్ స్టేడియంలో అధునాతన పరికరాలతో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రికి చెప్పినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ దేశంలో జరిగే ఏ క్రీడలైనా, క్రికెట్‌తో సహా రాష్ట్రం నుంచి, ముఖ్యంగా గచ్చిబౌలి ప్రాంతం నుంచే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టిందన్నారు. తెలంగాణ క్రీడలకు వేదికగా అవ్వడానికి అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. తప్పకుండా మన ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతుందని, దీనికి సంబంధించిన అంతర్జాతీయ కోచ్‌లను తీసుకొచ్చి రాష్ట్ర క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. దేశంలోనే క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ సీనియర్ నేత వీ. హనుమంతరావు, వేణుగోపాలాచారి, శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# వారెవ్వా బంగ్లా

## పాకిస్థాన్‌పై తొలి టెస్టు గెలుపు
## రావల్పిండిలో చారిత్రాత్మక విజయం
## మెహిది హసన్, షకిబ్ స్పిన్ మాయాజాలం
## ఆఖరి రోజు తడబడ్డ పాక్

**'రికార్డులనేవి ఉన్నది బ్రేక్ చేయడానికే'.. పాకిస్థాన్‌తో రావల్పిండి వేదికగా జరిగిన తొలి టెస్టుకు ముందు పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో బంగ్లాదేశ్ సారథి నజ్ముల్ హొసెన్ శాంతో చెప్పిన మాటలవి! కట్ చేస్తే సరిగ్గా ఐదు రోజుల తర్వాత అతడి మాటలే నిజమయ్యాయి. ఈ టెస్టుకు ముందు పాకిస్థాన్‌తో ఆడిన 13 టెస్టులకు గాను 12 మ్యాచ్‌లలోనూ బంగ్లాకు పరాభవమే. కానీ రావల్పిండిలో పర్యాటక జట్టు అద్భుతమే చేసింది. ఐదో రోజు ఆటలో క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో అనిశ్చితికి మారుపేరైన పాక్‌ను బోల్తా కొట్టించి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. నాలుగు రోజులూ బ్యాటర్లకు అనుకూలించిన రావల్పిండి పిచ్ ఐదో రోజు అనూహ్యంగా 'మలుపు'తీసుకోవడంతో మ్యాచ్ పాక్ చేతుల నుంచి చేజారింది.**




రావల్పిండి: పాకిస్థాన్ పర్యటనలో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. గడిచిన రెండు నెలలుగా దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడి 'అధికార మార్పు' ఆందోళనలతో అతలాకుతలమైన అక్కడి ప్రజలకు కాస్త స్వాంతన చేకూర్చుతూ ఆ దేశ క్రికెట్ జట్టు పాకిస్థాన్‌పై చారిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. రావల్పిండి వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టును 10 వికెట్ల తేడాతో గెలుచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ తమ ఎదుట ఉంచిన 117 పరుగుల ఆధిక్యాన్ని తగ్గించి పర్యాటక జట్టుకు లక్ష్యాన్ని నిర్దేశించే క్రమంలో షాన్ మసూద్ సారథ్యంలోని పాక్.. 55.5 ఓవర్లలో 146 పరుగులకే చేతులెత్తేసింది.

బంగ్లా స్పిన్ ద్వయం మెహిది హసన్ మిరాజ్ (4/21), షకిబ్ అల్ హసన్ (3/44) స్పిన్ మాయాజాలానికి పాక్ స్టార్ బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం పాక్ నిర్దేశించిన 30 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా ఓపెనర్లు వికెట్ నష్టపోకుండా పూర్తిచేసి ఆ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. బంగ్లా తరఫున తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం చేసిన ముష్ఫికర్ రహీమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 23 ఏండ్లుగా పాక్‌తో టెస్టులు ఆడుతున్న బంగ్లాకు ఇదే తొలి విజయం.

### స్పిన్ తంత్రానికి కుదేలు..

23/1. ఐదో రోజు ఆట ప్రారంభానికి ముందు పాక్ స్కోరు అది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 94 పరుగులు వెనుకబడ్డ పాక్ అనూహ్యంగా తడబడింది. కెప్టెన్ మసూద్ (14)ను రెండో ఓవర్‌కే హసన్ మహ్మద్ ఔట్ చేసి పాక్ పతనానికి దారులు వేశాడు. డ్రింక్స్ విరామం తర్వాత నహిద్ రాణా బౌలింగ్‌లో బాబర్ ఆజమ్ (22), ఆ మరుసటి ఓవర్లోనే షకిబ్ బౌలింగ్‌లో సౌద్ షకీల్ (0) స్టంపౌట్ అవడంతో పాక్ కష్టాలు రెట్టింపయ్యాయి. అదే ఊపులో షకిబ్.. షఫీక్ (37)ను పెవిలియన్‌కు పంపాడు. ఇక లంచ్‌కు రెండు ఓవర్ల ముందు మిరాజ్.. అఘా సల్మాన్ (0)నూ ఔట్ చేయడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది.

### లంచ్ తర్వాత మిరాజ్..

షహీన్ అఫ్రిది (2)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నసీమ్ షా (3)ను షకిబ్ ఔట్ చేశాడు. ఈ క్రమంలో పాక్ వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ (51) ఆ జట్టు వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. కానీ మిరాజ్ మరోసారి మాయ చేసి అతడిని క్లీన్ బౌల్డ్ చేయడంతో ఆ జట్టు ఆశలు అడుగంటాయి. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జకీర్ హసన్ (15 నాటౌట్), ఇస్లాం (9 నాటౌట్) తడబాటు లేకుండా లాంఛనాన్ని పూర్తిచేశారు.

**సంక్షిప్త స్కోర్లు**

పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 448/6 డిక్లేర్ (రిజ్వాన్ 171, షకీల్ 141), బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 565 ఆలౌట్ (ముష్ఫికర్ 191, మిరాజ్ 77)

పాక్ రెండో ఇన్నింగ్స్: 146 ఆలౌట్ (రిజ్వాన్ 51, మిరాజ్ 4/21, షకిబ్ 3/44) బంగ్లా రెండో ఇన్నింగ్స్ : 30/0 (జకీర్ 15 నాటౌట్)

1 పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు (14 మ్యాచ్‌లలో) విజయం.

1 పాక్‌ను స్వదేశం (టెస్టుల)లో 10 వికెట్ల తేడాతో ఓడించిన తొలి జట్టు బంగ్లా.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657